క్లుప్తంగా

పీజీ కళాశాలలో ఎప్‌సెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్



సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

గోదావరిఖనిటౌన్: స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎప్‌సెట్–2025 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమాకాంత్, కోఆర్డినేటర్ డి.సురేశ్‌కుమార్ తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే విద్యార్థులు ఎప్‌సెట్ హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు, టెన్త్, ఇంటర్ మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్లు, కులం, ఆదాయం సర్టిఫికెట్స్ (1–1–2025 తర్వాత), ఆధార్‌కార్డు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో రావాలని తెలిపారు. సర్టిఫికేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు తమకు కేటాయించిన లాగిన్ ద్వారా ఆప్షన్లు ఇవ్వాలని సూచించారు. వెరిఫికేషన్ కార్యక్రమంలో అధికారులు రవి, ప్రసాద్, రమేశ్‌రెడ్డి, అజయ్‌కుమార్, యాదయ్య పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్‌కు సన్మానం



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన నఫీజ్ అఫ్జల్ పాషాను మంగళవారం కేఎస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించారు. ఎంఈవో ఇల్లందుల విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు గసిగంటి రమేశ్, సతీశ్, సరళ, రజినీవందన, ఈశ్వర్, మల్లేశ్వరరావు, నంబయ్య, భరత్‌కుమార్, రజితకుమారి, ఖలీక్ పాల్గొన్నారు.

సెమ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ



అభినందిస్తున్న కరస్పాండెంట్ కేశవరెడ్డి

రామగిరి: జాతీయస్థాయి సెమ్స్ ఒలింపియాడ్‌లో కల్వచర్ల ప్రగతి పాఠశాల విద్యార్థులు కె.భవ్యశ్రీ, విద్వాన్, సీ.హెచ్.కార్తీకేయ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. వీరికి హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫౌండేషన్ సభ్యులు మెమెంటోలు అందజేశారు. విద్యార్థులను కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి మంగళవారం పాఠశాలలో సన్మానించారు.

ప్రభుత్వం చేతివృత్తులను ఆదుకోవాలి

గోదావరిఖని: మలబార్ గోల్డ్ లాంటి కార్పొరేట్ సంస్థలకు సహకరించడం మానుకొని, ప్రభుత్వం చేతి వృత్తుల వారిని ఆదుకోవాలని స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు రంగు శ్రీనివాస్, కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి కట్ట నగేష్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్వర్ణకారులకు సబ్సిడీ కల్పిస్తూ ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. స్వర్ణకార సంఘం కార్పొరేషన్ గౌరవ అధ్యక్షుడు శ్రీరామోజు సత్యనారాయణ, కోశాధికారి కట్ట శ్రీధరాచారి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దం వెంకటేశ్వర్లు, గాలిపెల్లి రమేశ్, జగన్, ప్రసాద్, పురుషోత్తం, విష్ణు, సదానందం, శివ, రాజేశ్ పాల్గొన్నారు.

పన్నీర్‌బటర్‌లో బొద్దింక రెస్టారెంట్‌కు జరిమానా



జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని కమాన్ వద్ద గల సాయిలీల రెస్టారెంట్‌లో పన్నీర్‌బటర్‌లో బొద్దింక ప్రత్యక్షమైంది. పెద్దపల్లి మండలం అందుగులపల్లికి చెందిన యువకుడు చపాతీలు, పన్నీర్‌బటర్ మసాలా ఆర్డర్ ఇవ్వగా అందులో బొద్దింక కనిపించింది. వెంటనే సదరు రెస్టారెంట్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన అధికారులు రెస్టారెంట్‌కు చేరుకుని విచారణ జరిపారు. నిర్లక్ష్యం ప్రదర్శించిన యాజమాన్యానికి రూ.20వేల జరిమానా విధించినట్టు జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్ తెలిపారు. వార్డు ఆఫీసర్లు అనిల్, శ్రీనివాస్, సుధీర్ ఉన్నారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా చందు

ధర్మారం: బీజేవైఎం మండల అధ్యక్షుడిగా మండలంలోని కొత్తూరుకు చెందిన మామిడి చందు నియామకమయ్యారు. జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు ఆదేశాల మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు తీగుళ్ల సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ సమావేశంలో చందును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆన్‌లైన్‌లో నల్లాబిల్లులు చెల్లించేలా చర్యలు

- నగరపాలక కమిషనర్ జె.అరుణశ్రీ



మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను తరహాలో నల్లాబిల్లుల రుసుం కూడా ఆన్‌లైన్‌లో చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం వార్డు అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆస్తి పన్నుతోపాటు నల్లా రుసుం కూడా ఇంటర్నెట్ ఆధారిత చేతి యంత్రాలతోనే ఏకకాలంలో వసూలు చేయాల్సి ఉంటుందన్నారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడానికి అనువైన ప్రాంతాల జాబితా సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. వార్డు అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి, ప్రజల నుంచి ఫిర్యాదు రాకముందే పారిశుధ్య సమస్యలు గుర్తించి పరిష్కరించాలని వార్డు అధికారులను ఆదేశించారు. వార్డుల విభజన ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో కొత్త డివిజన్ల వారీగా వార్డు అధికారులకు బాధ్యతలు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఖాజా జమీల్ అహ్మద్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేటాయించిన స్థలంలోనే వ్యాపారం చేసుకోవాలి

పెద్దపల్లిరూరల్: రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, మున్సిపల్ అధికారులు కేటాయించిన స్థలంలోనే వ్యాపారం చేసుకోవాలని ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్ సూచించారు. మున్సిపల్ ఆఫీసు ఆవరణలో మంగళవారం కమిషనర్ వెంకటేశ్‌తో కలిసి ఆయన వ్యాపారులకు సూచనలు చేశారు. వాహనదారులు వాహనాలను రోడ్లపై ఇష్టానుసారంగా నిలిపితే జరిమానా విధిస్తామన్నారు. పట్టణంలోని ప్రధానరోడ్లపై తోపుడుబండ్లు ఉంచొద్దని కమిషనర్ అన్నారు. చిరువ్యాపారుల తీరు కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రద్దీని బట్టి రెడ్, బ్లూ, గ్రీన్ జోన్లుగా విభజిస్తామని తెలిపారు. టీపీబీవో కిరణ్, టీఎంసీ స్వప్న, మెప్మా ఆర్పీలు, ఓబీలు పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్డుపైకి వస్తే జరిమానా



పెద్దపల్లిరూరల్: అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సై

పెద్దపల్లిరూరల్: రైతులు తమ పనుల కోసం ట్రాక్టర్లకు కేజీవీల్స్ అమర్చి రోడ్డెకితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానా విధిస్తామని సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పెద్దపల్లిరూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్సై మల్లేశ్‌తో కలిసి ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కేజీవీల్స్ కారణంగా రోడ్లు ధ్వంసం అవుతున్నాయన్నారు. కేజీవీల్స్‌తో రోడ్డుపైకి వస్తే తొలిసారి రూ.5వేల జరిమానా, రెండోసారి రూ.10వేలు, మూడోసారి పట్టుబడితే ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

జూలపల్లి: రహదారులపైకి ట్రాక్టర్‌కు కేజీవీల్స్ అమర్చి నడిపిస్తే జరిమానా తప్పదని ఎంపీడీవో పద్మజ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దారు స్వర్ణ, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఎస్ఐ సనత్‌కుమార్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హరితహారం, ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి, పారిశుధ్యంపై సమీక్షించారు. కార్యదర్శులు, ట్రాక్టర్ యజమానులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ధర్మారం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎస్సై శీలం లక్ష్మణ్, ఎంపీవో రమేశ్‌తో కలిసి ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్‌కుమార్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్ వెళ్తే చూసిన వ్యక్తులు వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని కోరారు.

పాఠశాలలో ఇంకుడుగుంతలు నిర్మించాలి

ధర్మారం: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని పత్తిపాక ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన ఎంఈవో ప్రభాకర్‌తో కలిసి సందర్శించారు. ఉపాధ్యాయుల బోధన అభ్యసన ప్రక్రియను పరిశీలించి తగు సలహాలు, సూచనలు చేశారు. ఎఫ్ఎల్ఎన్ ప్రారంభ పరీక్ష జవాబు పత్రాలను పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులు, పరిశుభ్రత, టాయిలెట్స్ తదితర అంశాలను పరిశీలించారు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నూతి మల్లన్న, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి తాళ్ల కిరణ్, ఉపాధ్యాయులు గంద్రాతి శ్రీలత, అనుముల శారద, అనపురం సునీల్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• చికిత్స పొందుతూ యువకుడు మృతి

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పిల్లిపల్లెకు చెందిన పిల్లి అజయ్(24) హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అజయ్ కొంత కాలంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటయ్యాడు. తల్లిదండ్రులు పలుమార్లు మందలించగా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి ఆచూకీ తెలుసుకొని ఇంటికి తీసుకొచ్చినా అతనిలో మార్పు రాలేదు. గత నెల 29న ఇంటి నుంచి బయటికి వెళ్లిన అజయ్ గుండారం పరిధిలోని రాజాపూర్ శివారులో గడ్డి మందు తాగానని సెల్‌ఫోన్‌లో తన మిత్రులకు తెలియజేశాడు. మిత్రులు, తండ్రి మల్లయ్య అక్కడికి వెళ్లి అజయ్‌ని పెద్దపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కమాన్‌పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

• చికిత్స పొందుతూ యువకుడు..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి బస్టాండ్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆవునూరి నితిన్ (17) కరీంనగర్ లో చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. జూలపల్లి మండలం కుమ్మరికుంటకు చెందిన నితిన్ తన సమీప బంధువు తనుగుల అన్వేష్‌తో కలిసి పెద్దపల్లికి బైక్‌పై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొన్నంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ ఇరువురికి ప్రాథమిక చికిత్స చేసి కరీంనగర్‌కు తరలించారు. నితిన్ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

• సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం

ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లిలో ప్రమాదవశాత్తు చనిపోయిన గొర్రెలకు సకాలంలో నష్టపరిహారం ఇప్పించినందుకు మంగళవారం గొర్రె కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగ మహేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో యాదవులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు లక్ష్మణ్‌కుమార్, శ్రీధర్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిరుపతి, శ్రీనివాస్, యాదవసంఘం నాయకులు మహేశ్, తిరుపతి, మహేశ్, రాజేశం, కనుకయ్య, మల్లేశం నాగయ్య, రాజేశం పాల్గొన్నారు.

• రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలి

యైటింక్లయిన్‌కాలనీ: సంగారెడ్డి జిల్లా సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం నిరసన తెలిపారు. ప్రమాదంలో కార్మికుల మరణానికి కారణమైన ఫ్యాక్టరీ యాజమాన్యం, అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు నరేశ్, అశోక్, రాజేశం, కొమురయ్య, మల్లేశం, లింగయ్య, నాగరాజు, రాజేశ్వరి, స్వామి, రాయమల్లు, లక్ష్మి పాల్గొన్నారు.

• అనుమానితులను విచారించిన పోలీసులు

ముత్తారం: ముత్తారంలో మంగళవారం రాత్రి గంజాయి అనుమానిత యువకులను పోలీసులు విచారించారు. మండలంలోని నలుగురు యువకులు గంజాయి తాగి వస్తుండగా ముత్తారం–అడవిశ్రీరాంపూర్ చౌరస్తా సమీపంలో పోలీసులు పట్టుకొని విచారించి ఆ యువకులను తల్లిదండ్రులకు అప్పగించారు. ఓడెడ్, ముత్తారం, అడవిశ్రీరాంపూర్‌లోని కొన్ని కిరాణ దుకాణాలలో మద్యంతో పాటు గంజాయి అమ్ముతున్నారని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

• కార్మికుల హక్కులు కాలరాస్తున్న కేంద్రం

రామగిరి: కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం కార్మిక రంగానికి తీరని అన్యాయం చేస్తోందని సింగరేణి యూనియన్స్ జేఏసీ కన్వీనర్ కోట రవీందర్ రెడ్డి అన్నారు. ఆర్జీ–3 ఏరియా పరిధిలోని ఓసీపీ–2లో మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జూలై 9న జరిగే సమ్మెలో సింగరేణి ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ ఆర్జీ–3 బ్రాంచ్ సెక్రటరీ ఎం.రాంచంద్రారెడ్డి, సీఐటీయూ బ్రాంచ్ సెక్రటరీ కొమురయ్య, టీబీజీకేఎస్ ఆర్జీ–3 ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య, నాయకులు సందెల కుమర్‌స్వామి, చంద్రశేఖర్, విష్ణు పాల్గొన్నారు.

• కనీస వేతనం చెల్లించాలి

జ్యోతినగర్: కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద మంగళవారం కార్మికులతో మాట్లాడారు. 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమ్మె బుక్‌లెట్లు కార్మి కులకు అందించారు.

• ఆటో ట్రాలీ యూనియన్ ఏకగ్రీవ ఎన్నిక

ముత్తారం: మండలంలోని సాయిరాం ఆటోట్రాలీ యూనియన్ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. యూనియన్ అధ్యక్షుడిగా అల్లం దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాగుల మొగిలి, ప్రధాన కార్యదర్శిగా కోళ్ల శ్రీనివాస్, దురుశెట్టి కుమార్‌ను, కోశాధికారిగా మధు, రఘు, నారాయణస్వామి, ప్రచార కార్యదర్శిగా గుడి సాగర్‌ను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడు మాట్లాడుతూ ఆటో ట్రాలీ యూనియన్ సభ్యులకు తాము అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని, తమ ఎన్నికకు సహకరించిన యూనియన్ సభ్యులందరికీ కతజ్ఞతలు తెలిపారు.

• సిద్దిపల్లె గ్రామ ప్రత్యేక అధికారిగా విజయ్‌కుమార్

కమాన్‌పూర్: మండలంలోని సిద్దిపల్లె గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా మండల విద్యాధికారి ఇల్లందుల విజయ్‌కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



అధికారులను సన్మానిస్తున్న ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో చేపట్టిన దశాబ్ది వారోత్సవాల్లో భాగంగా మంగళవారం 12 సేవా కార్యక్రమాలు చేపట్టామని క్లబ్ అధ్యక్షుడు రాంకిషన్ తెలిపారు. అప్పన్నపేటలో జెండా ఆవిష్కరించి, చందపల్లిలో మధుమేహం నిర్ధారణ పరీక్షలు చేశామని, జిల్లా ఆస్పత్రిలో అల్పాహారం అందజేశామని, పోస్టల్ వర్కర్ డే సందర్భంగా పోస్టుమెన్, డాక్టర్స్ డే సందర్భంగా జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్నకుమారి, సూపరింటెండెంట్ శ్రీధర్‌ను సత్కరించామని అన్నారు. మూలసాల ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ మరమ్మతుకు రూ.25 వేలు, సీలింగ్ ఫ్యాన్లు అందించామని పేర్కొన్నారు. సభ్యులు రమేశ్, జైపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, రాంరెడ్డి, కుమారస్వామి, శ్రీకాంత్, సాయిలు, మహేందర్‌రెడ్డి, దుబాసి కుమార్, విజిత్ సింహారావు, మహేశ్, హరిప్రసాద్, నవీన్‌కుమార్, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఇద్దరు పర్సనల్ అధికారుల బదిలీ

గోదావరిఖని: సింగరేణిలో ఇద్దరు పర్సనల్ అధికారులను బదిలీ చేస్తూ మంగళవారం యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఎస్ఆర్‌పీ వన్ ఇంక్లయిన్‌లో పనిచేస్తున్న సీనియర్ పర్సనల్ అధికారి సాధన్ ఆర్జీ–2 ఏరియాకు బదిలీ చేశారు. మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న అరుణ్‌తేజను ఎస్ఆర్‌పీ వన్ ఇంక్లయిన్‌కు బదిలీ చేశారు.

సమస్యల పరిష్కారానికి సమ్మె

పెద్దపల్లిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో మధ్యాహ్న భోజన వర్కర్లు పాల్గొంటారని ఆ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేశ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న వర్కర్లకు పనిభద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, సామాజిక భద్రత కల్పిస్తూ గ్రాట్యుటీ, పింఛన్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని, ప్రమాద బీమా వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాధమ్మ, పద్మ, భాగ్యలక్ష్మి, కళావతి, మల్లమ్మ తదితరులు ఉన్నారు.

సర్కారు బడులను ఆదరించాలి

సుల్తానాబాద్‌రూరల్: సకల సౌకర్యాలు, నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని జిల్లా విద్యాధికారి మాధవి తల్లిదండ్రులను కోరారు. మంచిరామి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆమె పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేసి మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యాబోధన చేస్తున్న సర్కారు బడులను ఆదరించాలని కోరారు. ఎంఈవోలు రాజయ్య, సురేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోరింటాకు సంబరాలు



జ్యోతినగర్: ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో మహిళా సామాజిక కార్యకర్త కంది సుజాత ఆధ్వర్యంలో మంగళవారం గోరింటాకు పెట్టుకొని సంబరాలు జరుపుకున్నారు.

వారాహిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



మంగళహారతి ఇస్తున్న భక్తులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని సాంబశివాలయంలో శ్రీవారాహిదేవి గుప్త నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వప్న వారాహిదేవి అవతారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మంగళహారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జ్యోతినగర్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్‌లోని అంతర్గత రోడ్డు అధ్వానంగా మారింది. ఎన్టీపీసీ రామగుండం ప్రభావిత ప్రాంతమైన ఈ డివిజన్‌పై మున్సిపల్ కార్పొరేషన్, ఎన్టీపీసీ అధికారులు అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చిన్న వర్షానికే రోడ్లు చిత్తడవుతున్నాయి. ఏ రోడ్డు చూసినా గుంతలుపడి బురదమయంతో ప్రమాదకరంగా మారాయి. అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రమాదాలు జరిగి పలువురు గాయాలపాలవుతున్నారు. రోడ్లు నిర్మించాలని గోలివాడ చంద్రకళ, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

వేగంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు



మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: స్థానిక ప్రధాన చౌరస్తాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. జీఎం కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్‌లో ఆర్జీ–1 ఏరియాలో 94శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. 3.77లక్షల టన్నుల లక్ష్యానికిగాను 3.56లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే సాధించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు 11.93లక్షల టన్నుల లక్ష్యానికి గాను 9.26లక్షల(78శాతం) టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిందన్నారు. సమావేశంలో అధికార ప్రతినిధి రవీందర్‌రెడ్డి, అధికారులు ఆంజనేయులు, ఆంజనేయప్రసాద్, చిలుక శ్రీనివాస్, జితేందర్‌సింగ్, వరప్రసాద్, వీరారెడ్డి, హనుమంత్‌రావు, వేణు పాల్గొన్నారు.

ఓసీపీ–3 డోజర్ సెక్షన్ సిబ్బంది పనితీరు భేష్



మాట్లాడుతున్న జీఎం బి.వెంకటయ్య

గోదావరిఖని: వందశాతం డోజర్ యంత్రాలను అందుబాటులో ఉంచి డోజర్ సెక్షన్ సిబ్బంది మిగతా ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని ఆర్జీ–2 జీఎం వెంకటయ్య కొనియాడారు. ఓసీపీ–3 డోజర్ సెక్షన్‌ను మంగళవారం సందర్శించి కార్మికులతో మాట్లాడారు. బొగ్గుఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఓసీపీ–3 కార్మికులు కీలకంగా వ్యవహరించారన్నారు. సింగరేణిలో అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించిన ఏరియాగా ఆర్జీ–2ను నిలిపిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా డోజర్ సెక్షన్‌లో మొక్క నాటారు. ఎస్‌వోటూ జీఎం రాముడు, ప్రాజెక్టు అధికారి ఉదయ్‌హరిజన్, ఇంజినీర్ రాజాజీ, పర్సనల్ డీజీఎం అరవిందరావు, సివిల్ డీజీఎం ధనుంజయ, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, బేస్‌వర్క్ షాప్ ఇన్‌చార్జి రాజశేఖర్, డోజర్ సెక్షన్ ఇంజినీర్ శివకోటయ్య పాల్గొన్నారు.

ఆర్జీ–3లో 85శాతం బొగ్గుఉత్పత్తి

రామగిరి: ఆర్జీ–3లో జూన్‌లో 85శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు మంగళవారం ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్ రావు తెలిపారు. నిర్దేశించిన 4.80 లక్షల టన్నులకు గాను 4.09 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, నిర్దేశించిన ఓబీ మట్టి వెలికితీత 31.50 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 20.53 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 65శాతం మట్టి వెలికి తీయడం, 5.41 లక్షల టన్నుల బొగ్గురవాణా చేసినట్లు వెల్లడించారు. గనుల వారీగా ఓసీపీ–1 గనికి నిర్దేశించిన 2.80లక్షల టన్నుల లక్ష్యానికి 2.23 లక్షలు(80శాతం), ఓసీపీ–2 గనికి నిర్దేశించిన 2.00 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 1.86 లక్షల టన్నులు(93శాతం) బొగ్గుఉత్పత్తి చేసినట్లు వివరించారు.

ఏపీఏ గనిలో..

ఏపీఏ గనిలో జూన్‌లో 13శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం కొలిపాక నాగేశ్వరరావు తెలిపారు. నిర్దేశించిన 0.95 లక్షల టన్నులకు గాను 0.12 లక్షల టన్నులు(13శాతం) బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. 0.10 టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు వివరించారు. భవిష్యత్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి సమష్టిగా కృషి చేస్తామన్నారు.

ప్రైవేట్ ఓబీ కాంట్రాక్టు కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న ప్రైవేట్ ఓబీ కాంట్రాక్టు కార్మికులు

రామగిరి: నిబంధనలు పాటించకుండా కంపెనీ ఎత్తేసిన ఓబీ యాజమాన్యం ద్వారా వేతనాలు చెల్లించాలని మంగళవారం ఆర్జీ–3 జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ముందుగా మండలంలోని సెంటినరికాలనీ ఏఐటీయూసీ కార్యాలయం నుంచి బిక్షాటన చేస్తూ జీఎం కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనంకు వినతిపత్రం అందజేశారు. మూడునెలల వేతనాలు చెల్లించాల్సిన సదరు యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రైవేట్ ఓబీ యాజమాన్యంతో కార్మికుల సమక్షంలో చర్చలు జరిపి న్యాయ చేస్తామని పర్సనల్ మేనేజర్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా రామగిరి పోలీసులు బందోబస్తు చేపట్టారు.



సుల్తానాబాద్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..



రామగిరి: సన్మానిస్తున్న సంఘం నాయకులు

జాతీయ వైద్యుల దినోత్సవం

సుల్తానాబాద్/జూలపల్లి/యైటింక్లయిన్‌కాలనీ/కాల్వశ్రీరాంపూర్/కమాన్‌పూర్/రామగిరి: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం డాక్టర్లను సన్మానించారు. స్కూళ్లలో వైద్యుల వేషధారణతో చిన్నారుల కృత్యాలు అలరించాయి.



కమన్‌పూర్: సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు